క్లుప్తంగా

కదిలిన ఉక్కు యాజమాన్యం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కొన్నేళ్ల కిందట జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మరణించిన కార్మికులు గొడ్డి అప్పారావు, సీతిన అచ్చుతరావు వివరాలపై ఎట్టకేలకు యాజమాన్యం స్పందించింది. బ్లాస్ట్ ఫర్నేస్‌లో విధులు నిర్వహించిన గొడ్డి అప్పారావు, సీతిన అచ్చుతరావులు విధి నిర్వహణలో ఉక్కు కర్మాగారంలో మరణించారు. అయితే ప్రమాదం కాదని బుకాయిస్తూ వచ్చిన యాజమాన్యం సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరితే నిరాకరించింది. అప్పీల్‌ను కూడా లెక్క చేయకపోవడంతో స.హ.చ కార్యకర్త పట్టా రామ అప్పారావు ఏకంగా రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు.దీంతో స్పందించిన యాజమాన్యం మంగళవారం ఇరువురి వివరాలు అందించిందని మృతుల కుటుంబ సభ్యులు నాగమ్మ, లక్ష్మి తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం



రిటైర్డ్ ఉద్యోగి సన్నిబాబును సత్కరిస్తున్న ఓబీసీ అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి, ఓబీసీ అసోసియేషన్ నాయకులు దొడ్డి సన్నిబాబును మంగళవారం స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ (ఎస్టీఎం) జనరల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహించిన సన్నిబాబు పదవీ విరమణ చేశారు. అసోసియేషన్ నాయకులు సన్నిబాబు దంపతులకు శాలువా కప్పి, జ్ఞాపికతో అభినందించారు. సన్నిబాబు స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు, ఉప ప్రధానకార్యదర్శి కొయిలాడ శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువకుల స్వచ్ఛంద రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

గాజువాక: జాతీయ వైద్యుల దినం సందర్భంగా గాజువాకలోని పలువురు యువకులు మంగళవారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇండస్ట్రియల్ బెల్ట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వందేభారత్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు వినోద్ బాలు మాట్లాడుతూ ఒక వ్యక్తి చేసిన రక్తదానంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సత్య శేఖర్, డాక్టర్ చిన్నప్ప, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పేదలకు గొడుగులు, అల్పాహారం వితరణ



గొడుగులు అందించిన ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అగనంపూడి నిర్వాసితకాలనీల్లోని నిరుపేదలకు గొడుగులు, అల్పాహారం అందించారు. అగనంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మడుగుల నరసింగరావు వీటిని సమకూర్చారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ప్రతినిధులు కిడిమి హనుమంతురావు, పొన్నగంటి కొండలరావు,రాము పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

బీచ్‌రోడ్డు: రేసపువానిపాలెంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఒక మహిళ, విటుడితో పాటు నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేసపువానిపాలెంలో నివాసం ఉంటున్న గిరిజ నాగలక్ష్మి, బోన రామకృష్ణ ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి, నిర్వాహకులైన గిరిజ నాగలక్ష్మి, బోన రామకృష్ణతో పాటు విటుడు గోవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒక యువతిని రక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి, పట్టుబడిన వారిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

ఇదేనా స్వచ్ఛాంధ్ర!



టీజీఆర్ నగర్‌లో చెత్తకుప్పవద్ద సంచరిస్తున్న పందులు



వుడాకాలనీలో చెత్తకుప్పను చిందర వందర చేస్తున్న పందులు..



వుడాకాలనీ ప్రధాన రహదారిలో పందుల తిష్ట

పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. ఫలితంగా ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఏ ప్రాంతంలో చూసినా పందులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. పందులు చెత్త కోసం గుంపులుగా చేరుతున్నాయి. చెత్తను చిందరవందర చేస్తూ అపరిశుభ్ర వాతావరణం సృష్టిస్తున్నాయి.

వ్యాధుల భయం..

అసలే వర్షాలు.. ఆపై చెత్త కుప్పలు..అవి చాలవన్నంటు పందులు సంచరించడంతో వ్యాధులు విజృంభిస్తాయని ప్రజలు భయపడుతున్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని..పందుల వల్ల ఇతర వ్యాధులు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. చెత్త సేకరణ కూడా చేయడం లేదని మండిపడుతున్నారు.

పందుల నియంత్రణలో విఫలం

మండలంలో పందుల సంచారాన్ని జీవీఎంసీ అధికారులు నియంత్రించ లేకపోతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. పందులు పెంపకందార్లు వీధుల్లోకి వదలిపెట్టి అధికారులకు సవాల్ విసురుతున్నారు. అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పందులను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. - పెదగంట్యాడ

అధినేతకు ఆత్మీయ కానుక



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి చిత్రపటం అందిస్తున్న యువజన విభాగం నాయకులు దొడ్డి కిరణ్, ఇమ్రాన్, చందు, అంబటి శైలేష్, చిత్రంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు దొడ్డి కిరణ్, ఇమ్రాన్, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరికూటి చందు, ఉత్తరాంధ్ర రీజనల్ యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శైలేష్ కలిసి బ్లడ్ ఆర్ట్ చిత్రాన్ని అందించారు.

యారాడలో జెట్టీ, బ్రేక్ వాటర్ ప్రాజెక్ట్ అవశ్యం

ఎమ్మెల్యే పల్లా



యారాడ తీరంలో సీసీఐఈఎఫ్ బృందంతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: యారాడలో జెట్టీ, బ్రేక్ వాటర్ ప్రాజెక్ట్ అత్యవసరమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర సీసీఐఈఎఫ్, రాష్ట్ర ఫిషరీస్ శాఖల అధికారులతో యారాడ తీరంలో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మత్స్యకారుల జీవనోపాధిని నిలబెట్టేందుకు.. సముద్రంలో సురక్షిత వాతావరణం నెలకొల్పేందుకు ఈ ప్రాజెక్ట్ దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్‌పై అధ్యయనం ప్రారంభించామని, ఇక్కడ జెట్టీ, బ్రేక్ వాటర్ ప్రాజెక్ట్ నిర్మించేందుకు తన వంతుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచే చేపల వేటకు వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగవరం పోర్టు వల్ల కోస్టల్ మెరైన్ ఎకో సిస్టం దెబ్బతిందని అన్నారు. దీని కారణంగా మత్స్యకారులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాల్సిన బాధ్యత గంగవరం పోర్టుపై ఉందన్నారు. ఈ విషయంలో అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కేంద్ర, రాష్ట్ర మత్స్యకారుల బృందం డిప్యూటీ డైరెక్టర్ ఎండీ బెల్లియప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ గోపాలకృష్ణ, సీసీఐఈఎఫ్ అధికారులు ఎస్ దినేష్ కుమార్, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిత్తడే..



వుడా కాలనీ చైతన్య కళాశాల పక్కన రోడ్డు పరిస్థితి



హౌసింగ్ బోర్డు కాలనీ పెంటమాంబ ఆలయం సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

పెదగంట్యాడ: మండలంలో మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఖాళీ ప్రదేశాలు చిత్తడిగా మారాయి. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గెడ్డ పక్కన రోడ్డు,73వ వార్డు వుడా కాలనీ చైతన్య కాలేజీ పక్క రోడ్డు, 75వ వార్డు పెంటమాంబ ఆలయం సమీపంలో ఉన్న రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. వాహచ చోదకులు, పాదచారులు బురదలోంచే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ ప్రాంతాల్లో విద్యార్థులు, పలు కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు, అధికారులు, సిబ్బంది అంతా ఈ రోడ్లు గుండానే వెళ్లాలి. రాకపోకల సమయంలో విద్యార్థులు బూట్లు, సాక్సులు తడిసిపోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.



చిత్తడిగా మారిన నడుపూరులోని ఉక్కు కళావేదిక ప్రాంతం



నడుపూరులో రోడ్డు పరిస్థితి

ఘనంగా లక్ష్మీదేవి అమ్మవారి ఊరేగింపు



లక్ష్మీదేవిని ఊరేగిస్తున్న పండా కుటుంబీకులు, భక్తులు



నరసింహస్వామి, రాముడి అవతారాల్లో జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా హేరా పంచమి (లక్ష్మీదేవి పూజ) సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారిని మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు గురు సంతోషకుమార్ స్వామి వారిని నరసింహస్వామిగా, రాముడి అవతారాల్లో అలంకరించారు. రెండు అవతారాల్లోని జగన్నాథస్వామిని భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. సాయంత్రం హేరా పంచమిని పురస్కరించుకొని దీపారాధన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి అలకపాన్పు వహించడం, ఆమెను తిరిగి ఇంద్రద్యుమ్నహాలు వద్దకు తీసుకువెళ్లే ఘటనను మహిళలు కళ్లకు కట్టినట్టు తెలియజేశారు. ఉదయం పొరాణి సేవా సమితి, సాయంత్రం సత్య సాయి భజన మండళ్ల ఆధ్వర్యంలో లలిత సహస్ర పారాయణం, భక్తిగీతాలాపన చేశారు. కార్యక్రమంలో గురు త్రినాథ్, మోహన్, ఆలయ ఈవో పద్మావతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, మామిడి నాగేశ్వరరావు, గల్లా సాయి, నారపిని నాగమణి, కుసుమంచి కుమారి, సిమ్మిది వరదారాణి, కరణం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తికి వన్నె తెచ్చిన డాక్టర్ రాయ్



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ గోపీకృష్ణ, చిత్రంలో వైద్యులు ప్రసన్నలక్ష్మి,ప్రత్యూష తదితరులు

అగనంపూడి: వైద్య వృత్తికి వన్నె తెచ్చిన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ సేవలు మరువలేనివని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ వైద్యునిగా చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఆయన జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. 1962 నుంచి జాతీయ వైద్యుల దినోత్సవం, వైద్య వృత్తిలో రాణించిన వైద్యులకు 1978 నుంచి బీసీరాయ్ అవార్డును కేంద్ర ప్రభుత్వం అందిస్తూ వస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రసన్నలక్ష్మి, డాక్టర్ ప్రత్యూష, సంతోష్‌రూప, ప్రమీల, దుర్గా కల్యాణి, ఆశాశ్రీ జాన్సన్, రవిరాజ్, నాయకులు కర్రి దేవేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువతరం సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్

మద్దిలపాలెం: ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. నరసింహారావు అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న సాంకేతికతలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేటి తరం సాంకేతిక యుగంలో ప్రయాణిస్తోందని గుర్తించాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నూతన జ్ఞానాన్ని అందించి, జ్ఞానాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటిగా నిలుస్తోందని ప్రశంసించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. సీతా మాణిక్యం మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలలో అవకాశం కల్పించాలని కోరారు. అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో యువతకు ఉపయుక్తంగా నిలిచే కార్యక్రమాల నిర్వహణను ఆమె ప్రశంసించారు. అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీవెన్ మాట్లాడుతూ, విద్యార్థులకు నూతన నైపుణ్యాలను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు స్వశక్తితో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. రెండు వారాల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా వెబ్ డిజైనింగ్ చేయగల సామర్థ్యాన్ని పొందారని, మొత్తం 56 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు.

భాషా సాహిత్యాల సవ్యసాచి ఆచార్య తూమాటి దోణప్ప

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆచార్య జిల్లా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆచార్య తూమాటి దోణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తూమాటి దోణప్ప గొప్ప పరిశోధకుడని, ఆయన జీవితం పరిశోధకులకు ఆదర్శమని కొనియాడారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రె అప్పారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో దోణప్ప శత జయంతి ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. దోణప్ప ప్రియ శిష్యుడు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఈ సభకు రావడం సభకు నిండుదనం తెచ్చిందని పేర్కొన్నారు. దోణప్ప తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.